బోరుబావి ప్రారంభం

రాయికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం బోరుబావిని ప్రారంభించారు. ఫ్లోరైడ్ నీటి సమస్యతో బాధ పడుతుండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన నిధుల నుంచి బోరు మోటార్ మంజూరు చేయగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గోపి రాజరెడ్డి, ఆకుల లక్ష్మీనారాయణ, తలారి రాజేష్, పల్లికొండ రమేష్, ఏశాల సాయిరెడ్డి, నానం రాజేందర్, ఆకుల గంగారెడ్డి, ఆర్మూరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ధర్మశాల ఆలయ భూముల డిజిటల్ సర్వే

జగిత్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో ఉన్న రాజరాజేశ్వరస్వామి (ధర్మశాల) ఆలయానికి సంబంధించిన భూముల హద్దులను లోకాయుక్త హైదరాబాద్ ఆదేశాల మేరకు మొదటి రోజు మంగళవారం జిల్లా ల్యాండ్స్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో డిజిటల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన 174 తదితర సర్వే నంబర్ల హద్దులను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ సుప్రియ, వరంగల్ జోన్ తహసీల్దార్, సర్వేయర్ సునీత, అనిల్ తదితరులు ఉన్నారు.

మత్స్యకారులకు చేపల పంపిణీ

కథలాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న కుంటల్లో పెంచుకునేందుకుగాను మంగళవారం ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్ గణేశ్, ఎంపీడీవో శంకర్ మత్స్యకారులకు రెండు లక్షల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సొసైటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పెంచడానికి అవకాశం కలిపిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మట్కం భూమయ్య, కల్లెడ శంకర్, మత్స్యకారులు ఉన్నారు.

జీతం ఇక్కడ.. వైద్యం అక్కడ



- పేరుకే ప్రభుత్వ వైద్యులు.. విధులు సొంత ఆసుపత్రుల్లో..
- పైస్థాయి నుంచి కింది స్థాయి వైద్యుల వరకు ఇదే పరిస్థితి
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని పాలకులు

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ వైద్యుల తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఆసుపత్రి పనివేళల్లో తమ సొంత క్లినిక్‌ల్లో సేవలు అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రధాన ఆసుపత్రి, మాతాశిశు కేంద్రంతో పాటు జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, పలు పీహెచ్‌సీ, యూహెచ్‌సీ, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న వైద్యుల్లో చాలామంది ప్రైవేటు ప్రాక్టీస్‌పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రులకు సంబంధించి అందిస్తున్న సేవలు ఘనంగా ఉన్నాయని సంబంధిత ఉన్నతాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అసుపత్రి పని వేళల్లో వైద్యులు అందుబాటులో లేక రోగులు నిరీక్షించాల్సి వస్తోంది. కొందరు వైద్యులు విధులను ఇతర వైద్యులకు అప్పగించి ప్రైవేట్ ప్రాక్టీస్‌లో ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ ఆసుపత్రి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, మాతా శిశు కేంద్రాల్లో పనిచేస్తున్న పలు వురు వైద్యుల తీరు విమర్శలకు తావిస్తోంది. వీరిని నియంత్రించే పరిస్థితి లేక పోవడంతో రోజురోజుకూ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సరైనవేళలో అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రు లకు వచ్చిన రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మిగతా 8వ పేజీలో...



ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి సమియోద్దీన్

మెట్‌పల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను మంగళవారం జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి సమియొద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రైవేట్ అసుపత్రులలోని డాక్టర్ల వివరాలు, అసుపత్రి రిజిస్ట్రేషన్, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, బయోవెస్ట్ మెనేజ్మెంట్, రికార్డులు మొదలైన వాటిని పరిశీలించారు. సరైన నిబంధనలు పాటించాని ప్రైవేట్ ఆసుపత్రులకు నోటిసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. అల్లాల అంజిత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఖుతుబొద్దీన్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పెంచాలి

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు గడువును మరికొన్ని రోజులు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేయించుకోలేకపోయారన్నారు. గత ఎన్నికల్లో సుమారు 1.97 లక్షల మంది ఓటర్లుగా నమోదు కాగా, 1.07 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ప్రస్తుతం గడువును మరింత పొడగించినట్లయితే అర్హులకు అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ యువజన విభాగం అధ్యక్షుడు కొక్కు గంగాధర్, నాయకులు తిరుపురం రాంచందర్, రాచకొండ సరోజ, బండపెల్లి మల్లీశ్వరీ, హృషికేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి గ్రామంలో మంగళవారం శ్రీఆంజనేయ శివ పంచాయతన యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం సుప్రభాత సేవ, మంటపారాధనలు, విగ్రహస్నపనం, లక్ష్మీ గణపతి, వాస్తు, దుర్గా, రుద్రమన్యు సూక్త స్వాకార హోమం, ధాన్యాదివాసం, ధాన్యాది వాసాంగ హోమం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వమించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్, నామని లక్ష్మీనర్సయ్య, చిట్యాల భూమయ్య, అజిత్ రావు, ఊరుమడ్ల వాసు, కుర్మపల్లె మాజీ సర్పంచ్, సుమలతరాయమల్లు, ఉప సర్పంచ్ మల్లేష్, పురోహితులు వినయ్, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

సూరమ్మ కుడి, ఎడమ కాలువ రైతులకు శుభవార్త

- పరిహారం కోసం నోటిఫికేషన్‌కు ఏర్పాట్లు
- ఆరేళ్లుగా రైతాంగం ఎదురుచూపు

6



కాలువల నిర్మాణం కోసం పాతిన హద్దులు

ధర్మపురిలో కొనసాగుతున్న గోదావరి హారతి

- నరసింహుని సన్నిధిలో భక్తుల పూజలు

5



గోదావరి హారతి నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ముస్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్



వినతులు స్వీకరిస్తున్న ముస్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో గల పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలిపారు. పట్టణ ప్రజలకు అత్యవసర సేవలైన తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రజల నుంచి ఏడు దరఖాస్తులు స్వీకరించామని, వీటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, మేనేజర్ సాగర్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- కుల గణన సర్వేకు సహకరించాలి

బుధవారం నుంచి ప్రారంభం కానున్న కుల గణనకు పట్టణ ప్రజలు సహకరించాలని బల్దియా ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. కులగణనకు వచ్చిన ఎన్యూమరేటర్‌కు వాస్తవమైన సమాచారం అందించాలని కోరారు. కుల గణన ప్రధాన ఉద్దేశం ఆయా కుటుంబాలు, వ్యక్తుల వారీగా ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకోవడమేనన్నారు. వాస్తవ సర్వే అందినప్పుడే నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా అందించే అవకాశం ఉందన్నారు. కుల, సామాజిక గణనకు వచ్చే వారికి సహకరించాలని కోరారు. సర్వే విషయంలో అసత్య ప్రచారాలు, ఆందోళన అపోహలకు గురికావద్దని జ్యోతి విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటుపై హర్షం

మేడిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం ప్రత్యేక బీసీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై మండలంలోని బీసీ సంఘాల నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. హైకోర్టు తీర్పును అనుసరించి ప్రత్యేక బీసీ కమీషన్ ఏర్పాటు చేసినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొంగోని రాజాగౌడ్, గోపు రాజారెడ్డి, వీరబత్తిని శేఖర్ నేత, పోతు గణేష్, అబ్దుల్ నాసర్, ప్రభాకర్, నరేష్ పాల్గొన్నారు.

యాసంగి పంటల సాగుపై అవగాహన

కొడిమ్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో బాగంగా యాసంగి పంటలలో కలుపు, యాజమాన్య పద్దతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు శాస్త్ర వేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ఏవో పి. జ్యోతి, పూడూర్ మాజీ సర్పంచు రాంరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల ఏఈవోలు గ్రీష్మ, రాజేష్, శ్రీలత, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొడిమ్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్, రామకిష్టాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొడిమ్యాల సింగిల్‌విండో ఛైర్మన్ రాజనర్సింగరావు మంగళవారం పరిశీలించారు. ఛైర్మన్ వెంట సింగిల్ విండో కార్యదర్శి గంగాధర్, మండల పరిషత్‌మాజీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, సింగిల్ విండో డైరెక్టర్లు ఊరు శంకరయ్య, మహంకాళీ గంగయ్య కనకట్ల రవి, పలువురు రైతులు ఉన్నారు.

మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో ప్రతీ ఒక్క రైస్‌మిల్లర్ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో జిల్లా పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు, రా రైస్ మిల్లర్లతో ధాన్యం దిగుమతి, సీఎంఆర్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా రా రైస్ మిల్లర్లు, బాయిల్డ్ రైస్ మిల్లర్లు తమ సమస్యలను కలెక్టర్ సత్య ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన సీఎంఆర్ నిబంధనల ప్రకారం 10 శాతం బ్యాంకు గ్యారంటీ రైస్ మిల్లర్లకు యధావిధిగా వర్తిస్తుందని తెలిపారు.

గతంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చెప్పిన రూల్స్ ప్రకారం బ్యాంకు గ్యారెంటీ వర్తిస్తాయన్నారు. రైస్ మిల్లర్లకు గతంలో చెల్లించాల్సిన బకాయి బిల్లులను చెల్లింపు చేస్తామని హామీ ఇచ్చారు. అందరి సహకారంతో ప్యాడీ దిగుమతి పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. కెపాసిటీ బట్టి మిల్లరు ప్యాడీ దిగుమతి చేసుకొని రైతులకు, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లయి కార్పొరేషన్ డీఎం జితేంద్రప్రసాద్, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ రాంచందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, జిల్లా పారా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ రావు, రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మైలారపు రాంబాబు, కోశాధికారి గోలి రమేష్, జిల్లా కస్టమ్ మిల్లింగ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, గంగాధర్, శ్రీరాములు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పోచమల్ల ప్రవీణ్, జిల్లాలో ని వివిధ ప్రాంతాల్లో గల పారా బాయిల్డ్, రా రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

- ఈవీఎం గోదాం తనిఖీ

జగిత్యాల పట్టణంలోని దరూర్ క్యాంపులో గల ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను సందర్శించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని ధ్రువీకరించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జగిత్యాలరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే ధ్రువీకరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాంచంద్రం ఏఈవోలకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ దళారులకు ధాన్యాన్ని విక్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యాన్ని రైతులు విధిగా ఆరబెట్టాలన్నారు. తేమశాతం 17లోపు ఉన్న ధాన్యాన్ని తూర్పారపట్టాలని అన్నారు. పొలాస రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం ద్వారా రైతులతో ముఖాముఖి కార్యక్రమం ద్వారా నేరుగా ప్రతీ మంగళవారం రైతులు శాస్త్రవేత్తలతో మాట్లాడవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ తిరుపతినాయక్, ఏఎంఎం గంగాధర్, ఏఈవోలు శ్రీనివాస్, హరీష్, ఆంజనేయులు, వరుణ్, రమ్య, రవళి పాల్గొన్నారు.

అర్హులను గుర్తించడానికే సమగ్ర కుటుంబ సర్వే

- కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అసలైన అర్హులను గుర్తించడానికే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది సేవలను వినియోగించుకోవాలని సర్కార్ నిర్ణాయించందని తెలిపారు. సర్వేను మూడు వారాల పాటు నిర్వహించనున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో సమగ్ర సర్వే నిర్వహించకపోవడంతో అసలైన అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. ప్రతి ఇంటికి సర్వే నిర్వహించి అర్హులైన ప్రతీ ఒక్కరిని గుర్తించడం జరుగుతుందన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

మల్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు సిద్ధం అవుతున్న రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, గడ్డి మందులు, యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి కె చంద్రదీపక్ సూచించారు. మండలంలోని ఎరువుల డీలర్లతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆయా సరుకులకు సంబంధించి బిల్లులు, స్టాక్ రిజిస్టర్‌లో పొందుపరచాలని అన్నారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయించి రసీదులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీలర్లు, ఏఈవోలు పాల్గొన్నారు.



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలి

- తపస్ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష



మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు భోనగిరి దేవయ్య

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్ రావు డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట డిమాండ్ల సాధన కోసం ధర్మాగ్రహ దీక్షను చేపట్టి అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగులు తమ అవసరాలకు దాచుకున్న జీపీఎఫ్ సంపాదిత సెలవుల మొత్తాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ధర్మాగ్రహ దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు న్యాయంగా రావల్సిన పీఆర్‌సీని వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణ, రాష్ట్ర నాయకులు రొట్టె శ్రీనివాస్, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, గుడిసె పూర్ణచందర్, మహేశ్వర శర్మ, గుర్రాల ప్రేమ్‌కుమార్, అందె శివప్రసాద్, కాశెట్టి రమేష్, రామకృష్ణ, మల్లేశం, శ్రీనివాస్, రఘునందన్, మహిళా నాయకురాలు శ్రీలత, భాగ్యలక్ష్మీ, రమాదేవి, తపస్ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేషన్‌డీలర్ సస్పెన్షన్

కరీంనగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామ రేషన్ డీలర్ సిహెచ్ రాజయ్యను సస్పెండ్ చేస్తూ సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేషన్ డీలర్ బియ్యం సరఫరా సక్రమంగా చేయడం లేదని పలువురు లబ్ధిదారులు ఫిర్యాదు చేయగా విజిలెన్స్ అధికారులు రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌లో తేడా రావడంతో అధికారులు సివిల్ సప్లయిస్ అధికారులకు నివేదిక పంపించారు. దీంతో మంగళవారం సివిల్ సప్లయిస్ అధికారు అధికారులు డీలర్ రాజయ్యను శాఖపరమైన కేసు నమోదు చేశారు. బియ్యం బస్తాల స్టాక్‌లో 6క్వింటాళ్ళకు పైగా తక్కువ వచ్చిందని అధికారులు తెలిపారు. రేషన్ సరుకులను ఇవ్వడానికి చామనపల్లి డీల ర్ వెంకటేష్‌కు బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అస్తిపంచి ఇవ్వాలని తరచుగా కుమారుడు వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ తండ్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన హస్నాబాద్‌లో చోటు చేసుకుంది. హస్నాబాద్‌కు చెందిన చాట్లపెల్లి గంగారాం(65) అనే వృద్ధుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి ప్రాంతానికి చెందిన పెద్ద కుమారుడు తిరుపతి కొన్ని రోజులుగా తన తండ్రిని ఆస్తి పంచి ఇవ్వాలని వేధిస్తున్నాడు. సోమవారం ఫోన్‌లో తన తండ్రితో ఆస్తి పంచి ఇవ్వాలంటూ వేధించాడు. తీవ్ర మనోవేదనకు గురైన గంగారాం మంగళవారం వేకువజామున తన ఇంటిలో ఉన్న రేకుల షెడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సెల్‌పాయింట్‌లో చోరీ

జగిత్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న శ్రీగాయత్రీ సెల్ పాయింట్‌లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. షాపు వెనుకభాగంలో ఉన్న వెంటిలేటర్‌ను పగులగొట్టిన దొంగలు షాపులోకి చొరబడి రూ. 15 వేల నగదుతో పాటు ఐదు లక్షల విలువ చేసే సెల్ ఫోన్లను అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కంప్యూటర్ యుగంలోనూ టైప్ హవా..



> ఒకప్పుడు పదోతరగతి పూర్తి కాగానే వేసవి సెలవుల్లో విద్యార్థులందరూ టైప్ నేర్చుకునేందుకు వెళ్లేవారు.. కంప్యూటర్ల రాకతో టైప్ జోరు తగ్గింది. ప్రభుత్వ ఉద్యోగా వకాశలు ఉండడంతో మళ్లీ యువత టైప్ నేర్చుకు నేందుకు మొగ్గు చూపుతున్నారు. కంప్యూటర్ కీబోర్డుపై పట్టు సాధించేందుకూ టైప్ నేర్చుకుంటున్నారు. దీంతో టైప్ ఇనిస్టిట్యూట్లు కళకళలాడుతున్నాయి.

- ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగవకాశాలు
- టైప్ ఇనిస్టిట్యూట్లకు తగ్గని ఆదరణ



టైపురైటింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

సిరిసిల్లటౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ యుగంలోనూ టైప్ రైటింగ్‌కు ఆదరణ తగ్గడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలల్లోని కొన్ని శాఖల్లో ఇప్పటికీ టైపు రైటర్లకు అవకాశాలు ఉంటున్నాయి. ఈ అవకా శాలను సద్వినియోగం చేసుకుంటున్న యువత టైప్ రైటింగ్ నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా టైపురైటింగ్ రాక ఇబ్బం ది పడుతున్న కొంతమంది ఉద్యోగులు కూడా రోజుకో గంట టైపురైటింగ్ ఇనిస్ట్యూట్‌లలో శిక్షణ పొందుతు న్నారు. కంప్యూటర్ కీబోర్డు వేగంగా ఆపరేటర్ చేయాలనుకునే వారు ముందుగా టైప్ ఇనిస్టిట్యూట్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. పోలీస్‌శాఖ, కోర్టుల్లో, మెడికల్ విభా గాల్లో టైప్ రైటర్లకు ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగ పోటి పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు టైపురైటింగ్ నేర్చుకొంటున్నారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో లోయర్, హయ్యర్ టైపురైటింగ్ శిక్షణకేంద్రాల్లో విద్యా ర్థులు శిక్షణ పొందుతున్నారు. దాదాపు ఆరునెలల కాల వ్యవధిలో ఎంచుకున్న కోర్సును పూర్తి చేస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు

పోలీసుశాఖ, కోర్టు వ్యవహారాలకు సంబంధించి ఇప్ప టికీ టైపు రైటింగ్ తప్పనిసరిగా మారింది. పోలీసు కాని స్టేబుల్ ఉద్యోగం సాధించిన యువతీయువకుల్లో టైపు రైటింగ్‌లో ప్రావీణ్యం ఉన్నవారు రైటర్లుగా, స్టెనో గ్రాఫర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కోర్టు టైపురైటింగ్ వచ్చిన కానిస్టేబుళ్లు వారెంట్‌లు ఇష్యూ చేస్తున్నారు.

● టైపు రైటింగ్‌తోనే ఉద్యోగం



టైపురైటింగ్ శిక్షణతో ఉద్యోగం సాధించా. అంతకు ముందు తెలుగు, ఇంగ్లీష్ లోయర్, హైయర్ టైపురైటింగ్ శిక్షణ పొందాను. పరీక్షలో అత్యధిక మార్కులు సాధిం చాను. ప్రస్తుతం సిరిసిల్ల కోర్టులో స్టెనో టైపిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాను.

- గాజుల రజని, కోర్టు స్టెనో టైపిస్ట్, సిరిసిల్ల

● టైప్ రైటింగ్ నేర్చుకోవాలి



ఉన్నత పాఠశాల విద్యాభ్యాసన సమయంలోనే టైప్ రైటింగ్ నేర్చుకోవాలి. కంప్యూటర్ యుగంలో ఉన్నత విద్యతోపాటు టైప్‌లో శిక్షణ పొంది ఇంగ్లీష్, తెలుగులో లోయర్, హైయర్‌లో స్టేట్‌బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు వస్తాయి. నాతో పాటు శిక్షణ పొందిన చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు.

- రెడ్డిమల్ల నర్సయ్య, కోర్టు స్టెనో టైపిస్ట్, వేములవాడ

పాఠశాలలో నాగుపాము కలకలం



పాఠశాల ఆవరణలో నాగుపాము

సిరిస్లిల రూరల్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నాగుపాము కలకలం సృష్టించింది. పాఠశాలలోని మరుగుదొడ్ల వద్ద తిరుగుతున్న నాగుపామును చూసిన విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పారు. వెంటనే పైపుల కిందికి దూరుతున్న పామును గుర్తించిన ఉపాధ్యాయులు పామును చంపేశారు. పాఠశాల మానేరు వాగు ఒడ్డున ఉన్నందున అక్కడి నుంచి పాములు పాఠశాల అవరణలోకి వస్తున్నట్లుగా గుర్తించామని, జిల్లా అధికారులు స్పందించి పాముల నివారణకు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ సుచరిత ఒకప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని గోదావరిఖని, హుజూరాబాద్, కరీంనగర్-1, జగిత్యాల, వేములవాడ డిపోల నుంచి బస్సులు ఉంటాయన్నారు. ఈ నెల13వ తేదీన బస్సులు బయలుదేరి 16న తిరిగి వస్తాయన్నారు. అరుణాచలానికి బస్సులు బయలుదేరి దారిలో కాణిపాకం, వెల్లూరు పుణ్య క్షేత్రాల సందర్శన కూడా ఉంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో జోగులాంబ గద్వాల నుంచి తిరిగి వస్తాయన్నారు.

ఛార్జీల వివరాలు:

డిపో	పెద్దలకు	పిల్లలకు	సర్వీసునెంబరు
గోదావరిఖని	4,850	4,000	69999
హుజూరాబాద్	4,500	3,800	75557
కరీంనగర్-1	4,500	3,800	75558
జగిత్యాల	4,700	3,900	75556
వేములవాడ	4,500	3,800	75555

మరిన్ని వివరాలకు సమీప డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల సౌకర్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం అన్నారు.

వాహనాల తనిఖీ

మెట్‌పల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం సాయంత్రం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అక్రమంగా గంజాయి, మద్యం, నాటుసారా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రిబుల్ రైడ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామని అన్నారు. మైనర్లు, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, అనిల్, రాజు, కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వర్షకొండ గ్రామ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న మోర్తాడ్ గ్రామానికి చెందిన ఇమ్రాన్ హైమద్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

శంకరపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లికి చెందిన చెందిన దాసారపు శ్యామ్ (28) అనే యువకుడు ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గోనె సంచుల టెండర్లలో భారీ స్కామ్

- బీజేపీ విచారణ జరిపించి అక్రమాలను వెలికితీయాలి
- సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోనె సంచుల కొనుగోలు టెండర్ల నిబంధనలు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం భారీ స్కామ్‌కు తెరలేపిందని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత దాన్ని బియ్యంగా తయారు చేసి గోనె సంచుల్లో నింపుతారని అన్నారు. ఆ గోనెల సంచుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టెండర్లను పిలిచిందని చెప్పారు. తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో 14.50 రూపాయల నుంచి 16 రూపాయలకు ఒక గోనె సంచి కొనుగోలుకు టెండర్లు పిలిచామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను ఎందుకు మార్చిందని ప్రశ్నించారు. ఓ వ్యక్తి సిఫారసు ద్వారా టెండర్‌లో నిబంధనలు మార్చారని, ఆయనే కమీషన్లను వసూలు చేస్తూ షాడో మంత్రిగా పనిచేస్తున్నాడని విమర్శించారు. ఆ షాడో వ్యక్తి ద్వారానే ఏ పని అయినా అవుతుందని, అధికారుల బదిలీలు కూడా ఆయన కనుసన్నల్లో జరుగుతాయని రవీందర్‌సింగ్ ఆరోపించారు. బీజేపీ సీఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి ప్రతిరోజు రైతుల కోసం మాట్లాడుతున్నారని, ఈ విషయమై కేంద్రానికి ఫిర్యాదు చేసి విచారణ జరిపించి అక్రమాలు వెలికి తీయించాలని డిమాండ్ చేశారు. గోనె సంచుల కుంభకోణంపై స్పందించకుంటే కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని రవీందర్‌సింగ్ స్పష్టం చేశారు. హరీశ్‌రావును అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిపి పనిచేస్తున్నాయని రవీందర్‌సింగ్ విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెంసారం తిరుపతి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, గొట్టం మహేశ్, నర్సయ్య, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- డీఆర్‌వో వెంకటేశ్వర్లు

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈనెల 4 నాటికి ఆయా జిల్లాల్లోని 271 మండలాల్లో 2,60,044 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని 16 మండలాల నుంచి ఆఫ్‌లైన్‌లో 210, ఆన్‌లైన్‌లో 58,657 మొత్తం 58,867 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి 271 మండలాల్లో 18,913 మంది ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారని, జిల్లాలో 2959 దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఓటరు నమోదులో తలెత్తుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు మడుపు మోహనాచారి, సత్తినేని శ్రీనివాస్, సిరిసిల్ల అంజయ్య, నాంపల్లి శ్రీనివాస్, ఎం.వాసుదేవరెడ్డి, కల్యాడపు ఆగయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకొని..

పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి హల్‌చల్

కోరుట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని మంగళవారం హల్‌చల్ సృష్టించాడు. గమనించిన పోలీసులు, స్థానికులు యువకుడిపై నీటిని పోసి అడ్డుకున్నారు.

స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గంగంపేట ప్రాంతానికి చెందిన ఓ వివాహితకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహితతో అదే కాలనీకి చెందిన షారుఖ్ అనే యువకుడు సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయం వివాహిత కుటుంబ సభ్యులకు తెలియడంతో రెండు రోజల క్రితం వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు రెండు రోజుల క్రితం యువకుడిని పిలుపించుకొని మాట్లాడి వివాహితతో ఉండవద్దని పెద్దల సమక్షంలో ఒప్పించి పంపిచారు. వివాహితకు తనను దూరం చేశారని అంటూ మంగళవారం మధ్యాహ్నం షారుఖ్ పెట్రోల్ బాటిల్‌తో పోలీస్‌స్టేషన్ సమీపంలోకి చేరుకొని ఒంటిపై పోసుకున్నాడు. అక్కడే ఉన్న స్థానికులు, పోలీసులు గమనించి అతడిపై అక్కడే ఉన్న నీటిని పోశారు. పెట్రోల్ నోట్లోకి వెళ్లడంతో షారుఖ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

ఓదెల లో శతాధిక వృద్ధురాలు మృతి



పోచమ్మ (ఫైల్)

ఓదెల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒడ్రెగడ్డలో మంగళవారం చింతం పోచమ్మ(105) అనే శతాధిక వృద్ధురాలు మృతిచెందింది. వృద్ధురాలు ఇన్నాళ్లు వృద్ధాప్యంలో కూడా తన దిన చర్యలను ఆమె సొంతంగా చేసుకుంది. 50 ఏళ్ల క్రితం భర్త లింగయ్య మృతిచెందగా, అప్పటినుంచి కొడుకు రాజయ్య వద్ద ఉంటోంది. వృద్ధు రాలికి కొడుకు, కూతురు కాగా, ఈమె తోడబుట్టిన వారిలో ఈమె పెద్దది. ప్రస్తుతం ఎవరు కూడా బతికి లేరు. పోచవ్వ అంత్య క్రియలకు తన బంధువులతోపాటు గ్రామస్తులంతా హాజరయ్యారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరు మృతి



పెసరి స్వామి(ఫైల్)

ధర్మారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండలం కటికెనపల్లి వద్ద కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అదే గ్రామా నికి చెందిన పెసరి స్వామి(48) మృతిచెందగా, మిట్ట ఆశాలు అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. మృతుడు తన బైక్‌పై మిట్ట ఆశాలును తీసుకొని కరీంనగర్ రోడ్డు నుంచి కటికెనపల్లి గ్రామంలోనికి ప్రవేశిస్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో పెసరి స్వామి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు

శంకరపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుక్కలు అడ్డురావడంతో బైక్‌పై నుంచి అదుపు తప్పి గాయపడ్డ లింగంపల్లి నారాయణరెడ్డి (70) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన కాచాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి నారాయణరెడ్డి గత నెల 20న తన ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వెళ్తుండగా కొత్తగట్టు సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ నారాయణరెడ్డిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నారాయణరెడ్డి కుమారుడు కిషన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో ఓ దొంగతనం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, గంజాయి కేసులో మరొకరికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణం జయనగర్‌కు చెందిన పుదారి రాజు 11 నవంబరు 2017న అంబికానగర్‌లోని ఒక ఇంట్లోకి చొరబడి రూ.97 వేల విలువగల వస్తువులు ఎత్తుకెళ్లాడు. ఆ ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పుదారి రాజును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. న్యాయమూర్తి ప్రవీణ్ కేసు పూర్వపరాలు పరిశీలించి పుదారి రాజుకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేలు జరిమానా విధించారు. గంజాయి కేసులో సిరిసిల్ల పట్టణం శివనగర్‌కు చెందిన ఐలవేణి సుమన్ అలియాస్ అర్జున్ గంజాయి విక్రయిస్తుండగా 9 సెప్టెంబరు 2023న సిరిసిల్ల పట్టణం కార్గిల్ లేక్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. న్యాయమూర్తి ప్రవీణ్ పూర్వపరాలు పరిశీలించి ఐలవేణి సుమన్‌కు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.5 వేల జరిమాన విధించారని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గొల్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొత్తునూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ లక్కం భాగ్యవ్వ (60) అనే మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. భాగ్యమ్మ సోమవారం రాత్రి కల్లెడ-వెల్గటూర్ రోడ్డుపై గ్రామంలోని ఓ కిరాణా దుకాణానికి వెళ్లి రోడ్డు దాటు తుండగా పల్లపు వెంకటస్వామి అనే వ్యక్తి తన ద్విచక్రవాహంతో ప్రమాదవశాత్తు భాగ్యవ్వను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భాగ్యవ్వ తలకు తీవ్ర గాయాలు కాగా, కుటుంబ సభ్యులు కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురికి కాలువలో పడి యువకుడి మృతి

జగిత్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మురికి కాలువలో మద్యం మత్తులో పడి యువకుడు మంగళవారం మృతి చెందాడు. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన మద్దెల సాగర్(38) అనే యువకుడు 10 సంవత్సరాలుగా జిల్లా కేంద్రంలోని హోటల్‌లో పనిచేస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో హోటల్ ఎదుట ఉన్న మురికి కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టవర్ ఎక్కి యువకుడి హంగామా

పెద్దపల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన రాకేష్ అనే యువకుడు మంగళవారం విద్యుత్ టవర్ ఎక్కి హంగామా సృష్టించాడు. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్.స్వామి, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని నచ్చజెప్పినా వినకుండా రాత్రి వరకు వరకు కిందకి దిగలేదు. స్థానికులు ఎంత బ్రతిమిలాడిన కూడా యువకుడు కిందకి దిగలేదు. యువకుడు టవర్ దిగి సమస్య చెపితేనే కారణాలు తెలిసే పరిస్థితి ఉంది. యువకుడిని కిందికి దింపేందుకు పోలీసులు, గ్రామస్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



అరుణ్(ఫైల్)



శశిధర్(ఫైల్)

రామడుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మండల కేంద్రానికి చెందిన నీలం అరుణ్(20), సామంతుల శివాజి అలియాస్ శశిధర్(18) అనే ఇద్దరు యువకులు కరీంనగర్‌కు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై రామడుగుకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మినీ ట్రక్కు ఢీకొంది. ఈ ప్రమాదంలో శశిధర్ అక్కడికక్కడే మృతి చెందగా, నీలం అరుణ్ బైక్‌పై నుంచి ఎగిరి పడాడు. తీవ్రంగా గాయ పడ్డ అరుణ్‌ను గ్రామస్థులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన వాహనం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడిమ్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మాలాపూర్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బోయిని శివమణి కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి జ్యోత్స్నదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనందుకు శివమణిని శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ నెల 8న యాదాద్రి భువనగిరి జిల్లాలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న క్రీడల్లో శివమణి ఆడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆదిరెడ్డి, గ్రామస్థులు నర్సయ్య, సత్యం, మహేష్, రాజు, సాయిలు, సతీష్ ఉన్నారు.

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్‌లోని శ్రీచైతన్య హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న బి వర్షిత్ ఎంపికైనట్లు పీఈటీలు ప్రశాంత్, వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీన హుజూరాబాద్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వర్షిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వర్షిత్‌ను పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పూర్ణ చందర్ అభినందించారు.



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీపోటీలకు ఎంపికైన వర్షిత్



దేవునిపల్లిలో సంతోష్ సాగు చేసిన వంకాయ తోట



అంటు పద్ధతి ద్వారా పెరిగిన మొక్కను చూపిస్తున్న రైతు

'అంటు' పద్ధతితో అధిక దిగుబడి..

పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ యువ రైతు కూరగాయల సాగులో నూతన పద్ధతులను అవలంభిస్తున్నాడు. సాధారణంగా పండ్ల మొక్కలకు అంటు కట్టడం మనకు తెలుసు. కానీ ప్రస్తుతం కూరగాయల మొక్కలకు సైతం అంటు కడుతున్నారు. ఈ 'అంటు' పద్ధతిలో చేస్తున్న వ్యవసాయంతో రెట్టింపు దిగుబడిని సాధ్యమవుతుంది. పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన ఓ యువ రైతు ఈ విధాన్ని అవలంభిస్తున్నాడు. మండలంలో ఇప్పటివరకు ఇలాంటి సాగు విధానం లేకపోవడవంతో పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దేవునిపల్లి గ్రామానికి వచ్చి సాగు పద్ధతిని పరిశీలించి రైతును వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

పెద్దపల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన బొక్కల సంతోష్ అనే యువ రైతు వంకాయ సాగులో నూతన పద్ధతిని పాటిస్తున్నాడు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని మిత్రుల ద్వారా 'అంటు' పద్ధతి గురించి తెలుసు కున్నాడు. వంకాయ సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు ఈ విధానం తోడ్పడుతుందని వారు సలహా ఇచ్చారు. దీంతో ఐదునెలల క్రితం హైదరాబాద్‌లోని నర్సరీల్లో లభించే 'అంటు' మొక్కలను పరిశీలించాడు. అడవిజాతి వంకాయ మొక్కకు మామూలు వంకాయ మొక్కను అంటు కట్టడంతో ఇవి తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడిని ఇస్తాయని తెలుసుకున్నాడు. స్థానికంగా రూ.1 చొప్పున లభించే వంకాయ మొక్కల కంటే 'అంటు' మొక్కలకు కాస్త రేటు ఎక్కువే అయినా రెట్టింపు దిగుబడి వస్తుందని ఆశించాడు. ఒక్కో మొక్కకు రూ.9 చొప్పున(ట్రాన్స్‌పోర్టుతో ఖర్చుతో కలిపి) కొనుగోలు చేసి తీసుకొచ్చి ఎకరానికి 1400 చొప్పున తనకున్న మూడు ఎకరాల్లో మొక్కలను నాటాడు. వంకాయ పంటకు అధికంగా సోకే అజింక వైరస్‌ను ఈ మొక్కలు తట్టుకోవడంతో పాటు దిగుబడి అధికంగా వస్తోందని రైతు సంతోష్ తెలిపాడు. 75 రోజుల తర్వాత దిగుబడి రావడం ప్రారంభం కాగా, రోజు విడిచి రోజు సుమారు రెండు క్వింటాళ్ల దిగుబడిని సాధిస్తున్నాడు.

● వంకాయ సాగులో యువరైతు ఆదర్శం..



అడవి వంకాయ చెట్టుకు కాసిన కాయలు

● అంటు పద్ధతి ప్రయోగం బాగుంది..



సాధారణంగా ప్రతి ఏటా పొలంతో పాటు, కూరగాయల పంటను సాగు చేసే వాడిని. కానీ దిగుబడి తక్కువగా వచ్చేది. నా మిత్రుల ద్వారా అంటు పద్ధతిలో సాగు గురించి తెలుసుకొని వంకాయ పంట వేశాను. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొక్కలు చనిపోకపోగా ఏపుగా పెరిగి మంచి దిగుబడినిచ్చాయి. అంటుపద్ధతి ద్వారా సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ఎక్కువకాలం దిగుబడి వస్తుంది.

- బొక్కల సంతోష్, దేవునిపల్లి

● తక్కువ నష్టం.. ఎక్కువ లాభం..

కూరగాయల సాగును సంతోష్‌కు ఏటా వర్షాలు భారీగా కురిసి తోట పూర్తిగా నష్టం వాటిల్లేది. ఈ ఏడాది అంటు పద్ధతిలో వంకాయ సాగు చేయడంతో వరదలు వచ్చినా పంటలకు ఎలాంటి తెగుళ్లు సోకక పోవడంతో పాటు మొక్కలు చనిపోలేదు. అలాగే వంకాయ పంటకు అధికంగా సోకే అజింక వైరస్ సైతం లేకుండా పోయింది. మరోవైపు వంకాయ సాగులో గతంలో నామమాత్రంగా కేవలం ఏడాదిపాటు మాత్రమే దిగుబడి వచ్చేది. కానీ అంటు పద్ధతిలో సాగు చేస్తే రెండింతలు దిగుబడి వస్తోంది. ఈ పద్ధతి ద్వారా రెండేళ్లపాటు దిగుబడి వస్తుందని రైతు సంతోష్ పేర్కొంటున్నాడు.

ఉషు పోటీల్లో ఉమ్మడి జిల్లాకు పతకాలు

22 పతకాలతో ప్రథమ స్థానంలో నిలిచిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పతకాలతో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17, అండర్-19 ఉషు పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈనెల 2, 3 తేదీల్లో మహబూబాబాద్‌లో నిర్వహించిన పాఠశాలల క్రీడా సమాఖ్య 68వ రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటి 22 పతకాలను సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో సీహెచ్ విప్లవ్, కె పవన్, బి కార్తీక్, ఇ సంజయ్(ఢిల్లీ జూనియర్ కళాశాల), కె శివసాయి(అల్ఫోర్స్ జూనియర్ కళాశాల), డి కావ్య (రాచర్ల జూనియర్ కళాశాల), డి సోని(కస్తూర్బా కళాశాల, సిరిసిల్ల) బంగారు పతకాలు సాధించారు. ఎస్ అరుణ్, బి శివాత్మిక (ఢిల్లీ జూనియర్ కళాశాల), కె అక్షిత, ఎ చందన(రాచర్ల జూనియర్ కళాశాల) రజత పతకాలు సాధించారు. కె జస్వంత్, డి అంజనీ ప్రియ, ఎస్ శ్రీజ (ఢిల్లీ జూనియర్ కళాశాల), ఎండి రఫిక్, ఎండి అయాన్ (ఫండస్ పాఠశాల), కె లక్ష్మి సందీప్, పి శ్రీరామ్ యాదవ్(జడ్పీహెచ్‌ఎస్ సిరిసిల్ల), బి మౌనిక, బి దీపిక, బి పూజ(కస్తూర్బా సిరిసిల్ల), కె స్నేతిక(భగవతి కరీంనగర్), జి ప్రవళిక(జడ్పీహెచ్‌ఎస్ సిరిసిల్ల) కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా విద్యా శాఖాధికారి వి జనార్ధన్‌రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా జూనియర్ కళాశాలల కార్యదర్శి జి మధు జాన్సన్, పాఠశాలల కార్యదర్శి బి వేణుగోపాల్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఉషు సంఘ ప్రధానకార్యదర్శి బార విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు గోపు సుశాంక్‌రెడ్డి అభినందించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు



క్రీడాకారులతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా అండర్-14 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 140 మంది బాలబాలికలు హాజరయ్యారు. జిల్లా యువజన క్రీడా అభివృద్ధి శాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహిచారు. ప్రతిభ చాటిన బాల బాలికలను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈనెలలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అంతడ్పుల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్ల పెటా అధ్యక్షుడు డాక్టర్ సురేందర్, హ్యాండ్‌బాల్ పోటీల కన్వీనర్ జి శ్రీనివాస్, పీడీలు అశోక్, రాజ్‌కుమార్, తిరుమలేష్, సుమన్, ప్రసాద్, కోచ్‌లు శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారి

గుంతలమయమైన కరీంనగర్-రాయపట్నం రోడ్డు



వల్లంపహాడ్ బ్రిడ్జిపై ఏర్పడిన గుంత

కరీంనగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి రాయపట్నం వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కరీంనగర్ మండలం వల్లంపహాడ్ బ్రిడ్జి సమీపంలో భారీ గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి వెంబడి వేలాది వాహనాలు కరీంనగర్ మీదుగా మంచిర్యాల వైపు ప్రయాణాలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో అతివేగంతో వచ్చే వాహనాలు గుంతల్లో పడి తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



వల్లంపహాడ్ సమీపంలో రహదారిపై ఏర్పడిన గుంత

ప్రజలకిచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కాంగ్రెస్ మహారాష్ట్రలో ఇచ్చిన పేపర్ ప్రకటనలు చూపిస్తున్న బండి సంజయ్

రుద్రంగి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ తెలంగాణ ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల హామీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి మండల కేంద్రంలో రూ.22లక్షల విలువైన ఎంపీ లాడ్స్ ఉపాధి హామీ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. ముందుగా స్థానిక లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు సమాధానం చెప్పే దమ్ముందా? అని ప్రశ్నించారు. సమాధానం చెప్పిన తరువాతే రాహుల్ గాంధీ తెలంగాణకు రావా లన్నారు.

ఎన్నికల హామీలతో కర్ణాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ మహారాష్ట్రలోనూ దొంగ హామీలు, అబద్ధాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు, ఎంతో అభివృద్ధి చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటూ మహారాష్ట్రలోని పేపర్లకు యాడ్స్ ఇవ్వడం సిగ్గు చేటన్నారు. గతంలో కేసీఆర్ ఇలాగే తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర, పంజాబ్‌ల్లో పంచారని, కాంగ్రెస్ నేతలు కేసీఆర్‌ను మించిపోయారని మండి పడ్డారు. ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతూ మహారాష్ట్ర ఎన్నికలకు తెలం గాణ పైసలను వాడుకుంటారా.. సిగ్గుండాలే.. అని విమ ర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు కాలేదని, రుణ మాఫీ పూర్తి కాలేదని అన్నారు. 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారన్నారు. మహారాష్ట్రలో మాత్రం రుణమాఫీ చేసినట్లు, గ్యారంటీలను అమలు చేసినట్లు గొప్పగా ప్రకటనలు ఇస్తున్నారని, మహారాష్ట్ర చెవిలో పూలు పెడదామనుకుంటున్నారని అన్నారు. దొంగ హామీలతో కర్ణాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చినట్లుగా మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావడం సిగ్గు చేటన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలన్నారు. పాదయాత్రలో మూసీ వద్దకు వెళ్లినపుడు విషం గక్కుతున్న నీళ్లను కళ్లారా చూశానన్నారు. సాగునీరు సంగతి దేవుడెరుగు.. యాదాద్రి జిల్లా ప్రజలు తాగునీటిని కొనుక్కునే పరిస్థితి ఉందన్నారు. మూసీని ప్రక్షాళన చేయాలని మొదటి నుంచి బీజేపీ కోరుతోందని కానీ ఆ పేరుతో పేదల ఇళ్లను కూల్చవద్దన్నది తమ డిమాండ్ అన్నారు. మూసీ పేరిట లక్షన్నర కోట్ల దోపిడీని ఆపాలన్నారు.

రూ.15 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టుకు రూ.1.50 లక్షల కోట్లకు పెంచి కమీషన్లు దండుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. తెలంగాణ నిండా అప్పుల్లో మునిగి పోయిందని, బీఆర్ఎస్ చేసినే అప్పులు తీర్చేందుకు గంటకు రూ.3 కోట్ల మిత్తి కట్టాల్సి వస్తోందని మంత్రులు మొత్తుకుంటున్నారని అన్నారు.

జీతాలకే ఇబ్బంది ఉందని, మళ్లీ లక్షన్నర కోట్లు అప్పు తెచ్చి జనంపై రుద్దడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత కుటుంబానికి కాంట్రాక్ట్ కట్టబెట్టడానికి తెలంగాణ ప్రజల జీవితాలను పణంగా పెడతారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుం బం లక్ష కోట్లు దోచుకుంటే. మీరు లక్షన్నర కోట్లు దోచిపెట్టడానికి మూసీని వాడుకుంటారా? అన్నారు. మాజీ సర్పంచుల తరపున బీఆర్ఎస్ ఆందోళన సిగ్గు చేటని, చంపినోడే సంతాప సభ పెట్టినట్లుగా ఉందని అన్నారు. మొదటి నుంచి సర్పంచుల సమస్యలపై పోరాటం చేసింది బీజేపీయేనని అని గుర్తు చేశారు. శంషాబాద్‌లో ఆంజనేయ స్వామి ఆలయంపై దాడి అమానుషమన్నారు.

తక్షణమే దుండగులను అరెస్ట్ చేయాలని, హిందూ ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి నోరు మెదపడం లేదని అన్నారు. హిందువులంతా రోడ్డెక్కే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను అరిగోస పెడుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, సీనియర్ నాయకులు పడాల గణేష్, బోయిని రాజు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జపాన్ పర్యటనకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

అభినందించిన కలెక్టర్ సత్యప్రసాద్



కలెక్టర్ సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థిని

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గొల్లపల్లి మోడల్ స్కూల్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కలికోట శ్రీజ జపాన్ పర్యటనకు ఎంపిక కాగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మంగళవారం అభినందించారు. ఇన్‌స్పైయిర్ జాతీయస్థాయి మేళాలో పాల్గొన్న విద్యార్థులల్లో ప్రతిభ కనబరిచిన వారికి జపాన్ పర్యటనకు ఎంపిక చేయగా అందులో శ్రీజకు చోటు దక్కింది. రాష్ట్రానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు జపాన్ సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం సకురలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. అందులో జిల్లాకు చెందిన శ్రీజ ఉండడంతో కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. నవంబరు 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జపాన్‌లో జరిగే సకుర కార్యక్రమంలో అధునిక శాస్త్ర సాంకేతికలను విద్యార్థిని శ్రీజ వీక్షించనున్నారు.

బద్ది పోచమ్మకు బోనం



వేములవాడ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బద్దిపోచమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్ది పోచమ్మకు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండి డప్పుచప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అమ్మవారి దర్శనానికి గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. సుమారు మూడు గంటల తరవాత అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి పట్నాలు వేసి ఒడిబియ్యం, అనంతరం నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. భక్తుల తాకిడి పెరగడంతో ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆలయ ఇన్‌చార్జి ఎడ్ల శివసాయికి సూచించారు. అనంతరం బుక్ కౌంటింగ్‌తోపాటు పలు రికార్డులను పరిశీలించారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా మెదలాలని సిబ్బందికి సూచించారు.





రాజన్న దర్శనం కోసం భక్తుల క్యూ, బద్దిపోచమ్మ ఆలయం వద్ద బోనాలతో భక్తులు

కొండగట్టుకు 'కార్తీక' శోభ

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు ● అంజన్న సన్నిధిలో పూజలు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు

మల్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయ స్వామిని సన్నిధానం కార్తీకమాస శోభను సంతరించుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. మంగళవారం కార్తీక నాగుల చవితి కావడంతో ఆలయం ఉత్తరం వైపు గల నాగ ప్రతిమల వద్ద పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, బేతాళుడి ఆలయంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ నాంపల్లి ఆధ్వర్యంలో భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

ధర్మపురిలో కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నాలుగో రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చారు. మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు.కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో భక్తులు పూజలు

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురిలో మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, గోదావరి నదిలో భక్తు లు కార్తీక స్నానాలు ఆచరించి, నదిలో కార్తీక దీపాలు వదిలారు. నరసింహుని ఆలయంలో పూజలు చేశారు. ఆలయ ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేసి, లక్ష వత్తులు వెలిగించారు. నాగుల చవితి సందర్భంగా రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాగదేవతకు పాలు పోసి పూజించారు.



నాగ దేవతను పూజిస్తున్న భక్తులు

'ఒంటిపూట బడులతో నిరుపేద విద్యార్థులు విద్యకు దూరం'

గొల్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన సర్వే పేరిట ప్రాథమిక పాఠశాలలకు ఒంటి పూట బడులు నిర్వహించడం వల్ల నిరుపేద విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం గొల్లపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద, దళిత, బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుతున్నారన్నారు. కులగణన సర్వే పేరిట ప్రభుత్వం ఒంటి పూట బడులు నిర్వహించడం వల్ల వారు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు.

ఒక పూట బడులను పూర్తిగా మూసివేసే బదులు కొంత మంది ఉపాధ్యాయులకు ఉదయం పూట, మరికొంత మంది ఉపాధ్యాయులకు పగటి పూట కుల గణన సర్వే అప్పగించాల న్నారు. దీంతో రెండు పూటల బడులు నిర్వహించుకునే వెసులుబాటు ఉంటుం దని, దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు పునరాలోచించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు బండి శ్రీనివాస్, గుండెల నరేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

ధర్మపురి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ. నరేందర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల గణన కోసం ఒంటి పూట బడులు నిర్వహించడం సరియైన విధానం కాదన్నారు. కుల గణన పేరుతో ప్రాథమిక పాఠశాలలను మూసివేయడం, చాలీచాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించడం సరికాదాన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల నాయకులు రాజేశం, మల్లిఖార్జున్, నాందేవ్, గంగాధర్ పాల్గొన్నారు.

జీతం ఇక్కడ..వైద్యం అక్కడ

(ఐదో పేజీ తరువాయి..)

● **నిబంధనలు ఇలా..**

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ సేవలు అందించాలి. మధ్యాహ్న భోజనం అనంతరం రెండు గంటల నుంచి మెడికల్ కళాశాలలో టీచింగ్ విధులను పలువురు వైద్యులు నిర్వర్తించాల్సి ఉంది. ఎమర్జెన్సీ విభాగంలో సేవలు అందించే వైద్యులకు రోస్టర్ పద్ధతిలో పలువురు వైద్యులకు విధులను కేటాయిస్తున్నారు. సంబంధిత వైద్యులు ఎమర్జెన్సీ విభాగంలో సేవలు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ వైద్యులు విధినిర్వహణ సమయాల్లో ప్రైవేట్ క్లినిక్‌ల్లో విధులు నిర్వహించకూడదు. కానీ ఈ నిబంధనలు ఆసుపత్రుల్లో అమలు కావడం లేదు. ఇక్కడ పనిచేసే వైద్యులు ఉదయం ఆసుపత్రికి వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి సుమారు ఉదయం 11 గంటల వరకు సొంత క్లినిక్‌కు వెళ్లిపోతున్నారు. ఒకరిద్దరు కాదు ఉన్నతాధికారి నుంచి మొదలు కొని సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ సర్జన్లు, స్పెషలిస్టుల వరకు ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు జగిత్యాల జిల్లా ఆసుపత్రితో పాటు అనుసంధానంగా మాతాశిశు ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ప్రజలకు ఏ చిన్న జబ్బు చేసినా ఇక్కడికే వస్తారు. కానీ ఆసుపత్రి వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పేదలకు సర్కారు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్యులు ఉదయం 11 గంటలకు వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం నుంచి భారీగా జీతాలు తీసుకునే వైద్యులు సొంత క్లినిక్‌ల్లో పని చేస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం వైద్యశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

● **సొంతంగా క్లినిక్‌లు..**

జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పలువురు వైద్యాధికారులు విధులు నిర్వహించాల్సి ఉండగా పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మాతాశిశు ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ద్వారా పలువురు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. మెజారిటీ వైద్యులు సొంతంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని వాటికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. దాదాపు పాతికమంది వైద్యులు స్థానికంగానే సొంత క్లినిక్‌లు నడుపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులను వారివారి క్లినిక్‌లకు రావాలని వైద్యులు సూచించడం గమనార్హం. చాలా మంది రోగులు విధిలేక ప్రైవేట్ క్లినిక్ లకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. జిల్లా అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్లే వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఇటు ప్రజలు, అటు రోగులు కోరుతున్నారు.

ఆసుపత్రి వేళల్లో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయకూడదు

రాములు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, జగిత్యాల



ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్యాధికారులు విధుల్లో ఉండాలి. ఆసుపత్రి వేళల్లో బయట క్లినిక్‌ల్లో సేవలు అందించ కూడదు. రోగులు ఎవరైనా ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాము. మధ్యాహ్నం రెండు గంటల అనంతరం ప్రత్యేక విధులు నిర్వహించే వారు మినహా సదరు వైద్యులు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరము లేదు.

లబ్ధిదారులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందేలా బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల రైతులను అందిస్తున్న రుణమాఫీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ లోన్, ఎంఎస్ఎంఈ రుణాల పంపిణీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

రైతు పాదయాత్ర విజయవంతం చేయాలి

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విదానాలను ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న రైతు పాదయాత్రను నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, పార్టీ అనుబంధ నాయకులతో సమీక్ష సమావేశంను నిర్వహించి స్థానికంగా ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 12న కోరుట్ల నియోజకవర్గం నుంచి పాదయాత్ర జిల్లా కేంద్రం వరకు నిర్వహించి సమస్యలను కలెక్టర్ వివరించనున్నట్లు తెలిపారు. పాదయాత్రకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, సర్పం చ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేపట్టాలి

మల్లాపూర్ (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని చిట్టాపూర్, సాతారం, ముత్యంపేట గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ రైతులు పండించిన పంటను కేంద్రాలకు తీసుకొచ్చిన వెంటనే తూకం వేయాలన్నారు. కార్యక్రమంలో సెర్ప్ అధికారులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరం సమన్వయంతో పనిచేసి అభివృద్ధి, సంక్షేమంలో జగిత్యాల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదామని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ బీఎస్ లతను టీఎన్‌జీఓలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించడంతో పాటు శాలువ కప్పి సత్కరించారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సహకారాలతో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి, నాయకులు అమరేందర్ రెడ్డి, సాహెద్ బాబు, రవి చంద్ర, రవీందర్, రాజేందర్, రాములు,సుగుణాకర్, మధుకర్, హరిప్రసాద్, వెంకట పవన్, మమత, శైలజ, శ్రావణి, శివాని, విజయ, రజశ్రీ, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

రాష్ట్ర మానిటరింగ్ అధికారి డాక్టర్ లక్ష్మారెడ్డి



గుడిపేటలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రాష్ట్ర మానిటరింగ్ అధికారి డా.లక్ష్మారెడ్డి సూచించారు. మండలంలోని గుడిపేటలో గాలికుంటు వ్యాధి టీకాల శిబిరంను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాలికుంటు వ్యాధితో కలిగే నష్టాలను అవగాహన కల్పించారు. మంగళవారం 121 పశువులకు టీకాలు వేసినట్లు మండల శువైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా పశువైద్యాధికారి మనోహర్, సిబ్బంది శ్రీనివాస్, బాబు, రాజశ్రీ, మల్లేశం, కిషోర్, ఆశాలు, వంశీ, రైతులు పాల్గొన్నారు

జగిత్యాలరూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మాజీపేట గ్రామంలో వెటర్నరీ అధికారుల ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందని, పశుశులకు టీకాలు వేయించి వ్యాధి నుంచి కాపాడుకోవాలని పాడి రైతులకు అధికారులు సూచించారు. కార్యక్రమంలో పొలాస వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్, ఆఫీస్ సబార్డినేట్ అనిత, పంచాయితీ సెక్రెటరీ విజయ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పెగడపల్లి (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని రాములపల్లిలో మంగళవారం పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడంతో పాటు సాధారణ జబ్బులకు చికిత్సలు అందించి మందుదులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, పశువైద్య సిబ్బంది వినీత్, నర్సయ్య, తిరుపతి పాల్గొన్నారు.

పొలాస కళాశాల విద్యార్థుల శ్రమదానం

మెట్‌పల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. మంగళవారం గ్రామంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం రైతు వేదిక, ప్రాథమిక పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి చెత్తను తొలగించారు. కళాశా ల విద్యార్థులు గ్రామంలోని మొక్కజొన్న, పసుపు పంటలను పరిశీలించి చీడపీడలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వాతావరణంలో జరుగుతున్న మార్పుల వల్ల సాగు చేస్తున్న రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కలాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లు యెల్లాగౌడ్, రత్నాకర్, ప్రజ్ఞా, విద్యార్థులు, ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న విద్యార్థినులు

టీడీపీ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యుడిగా భార్గవ రామ్



గొల్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరామ్ పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ అడ్‌హక్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్లమెంట్ అడ్‌హక్ కమిటీలను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయగా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన భార్గవ రామ్‌కు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడుకు భార్గవరామ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పునర్వైభవానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా భార్గవ రామ్ పేర్కొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల పేట గ్రామంలో రేణుక ఎల్లమ్మ బోనాల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయంలోని అమ్మ వారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనాలను నెత్తిన ఎత్తుకుని డోలు వాయిద్యాలు, పోతురాజు నృత్యాలతో మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మ వారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



చింతలపేటలో బోనాలతో భక్తులు

శిశువుల తారుమారు ఘటనలో.. ముగ్గురు ఉద్యోగులపై చర్యలు

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాతాశిశు కేంద్రంలో శిశువుల తారుమారు సంఘటనలో బాధ్యులైన ముగ్గురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు ఆసుపత్రి సూపరిటెండెంట్ రాములు మంగళవారం తెలిపారు. సంఘటనపై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. సంఘటనకు కారణమైన ఆయాను ఉద్యోగం నుంచి టర్మినేట్ చేశామని, ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్లకు మెమోలు జారీ చేశామని తెలిపారు. సంబంధిత స్టాఫ్ నర్సులు నిర్ణీత గడువులోగా సమాదానం ఇవ్వాల్సి ఉందన్నారు. సంతృప్తికరమైన సమాదానం రాకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

'రామకృష్ణ'లో ఫ్రెషర్స్‌డే హంగామా

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో బీకాం, బీబీఏ విభాగం విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలను స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో కామర్స్ విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. సృజనాత్మకత జోడిస్తే ఏ రంగంలో అయిన ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమేష్, కళాశాల ప్లేస్మెంట్ అధికారి మల్లేశం, అధ్యాపకులు, ఆయా విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి



పొలం బాట నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

కొడిమ్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసీట ర్లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ డీఈ ఎ రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హిమ్మతురావుపేట, దమ్మయ్యపేట గ్రామాల్లో విద్యుత్ పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఈ విద్యుత్ భద్రత, ప్రమాదాలు జరుగకుండ తీసుకోవాలిసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో మల్యాల ఏడీఈ ఆర్ మహేందర్, ఏఈ ఆర్ రఘునాథ్, కొడిమ్యాల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టెక్నికల్ డివిజన్ ఇంజనీర్ గంగారాం మాట్లాడుతూ రైతులు ట్రాన్స్‌ఫా ర్మర్ ఫ్యూజులు ముట్టుకోవద్దని సూచించారు. ఎలాంటి సమస్యలు వచ్చిన విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కారిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్, ఏఈ శ్రీధర్, చల్‌గల్ సెక్షన్ విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే సామగ్రి పంపిణీ

కొడిమ్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సామగ్రిని ఎంపీడీవో ఇ స్వరూప ఎన్యూమరేటర్లకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బుధవారం నుంచి మండలంలో 104 మంది ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఇంటింటికి సర్వే కోసం వస్తున్న ఎన్యుమరేటర్లకు ప్రజలు పూర్తిస్థాయి సమాచారం తెలుపాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సూపరింటెండెంట్ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.



సామగ్రి పంపిణీ చేస్తున్న కొడిమ్యాల ఎంపీడీవో

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయ సమావేశ హాల్‌లో సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే ఎన్యూమరేటర్లకు మెటీరియల్స్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్యూమ రేటర్లు పకడ్బందీగా సర్వే చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ బాలె గంగాధర్, శానిటీరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, సిబ్బంది, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బుధవారం నుంచి నిర్వహించనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీ య, కుల సర్వేను గ్రామాల్లో పకడ్బందీ గా నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శంకర్ ఒక ప్రటనలో తెలిపారు. మండ లంలోని 19 గ్రామాల్లో బ్లాక్‌ల వారీగా 2011 జనాభా ప్రకారం ఉన్న ఇళ్ల సంఖ్య ఆధారంగా 92 మంది ఎన్యూమరేటర్లతో సర్వేకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే ఇంటింటికీ స్టిక్కర్లు వేయనున్నామన్నారు. ప్రజలు సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

డాక్టరేట్ పొందిన యువకుడికి సన్మానం

పెగడపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన కోలపురి చంద్రశేఖర్ అనే యువకుడు ఇటీవల ఉస్మానియా యానివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకోగా మంగళవారం మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రోల్ ఇన్ ఇండియన్ ఎలక్టోరల్ పాలిటిక్స్ పైన చేసిన పరిశోదనకు గాను డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు దీకొండ మహేందర్, ఆరెల్లి రాకేష్, శ్రీరాం అంజయ్య, గసిగంటి గోపాల్, అంజయ్య, హేమంత్, లచ్చయ్య, హన్మయ్య, నర్సయ్య తదితరులు అభినందించారు.

బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం

మెట్‌పల్లి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం మంగళవారం ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు కృష్ణరావు అదేశాల మేరకు ఆయన బాధిత కుటుంబ సభ్యుల ఇంటి వద్దకు వెళ్లి నష్టపరిహారం అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెట్టి లక్ష్మణ్, మహేంధర్, ఆనంద్, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ కుడి, ఎడమ కాలువ రైతులకు శుభవార్త

● **పరిహారం కోసం నోటిఫికేషన్‌కు ఏర్పాట్లు**

● **ఆరేళ్లుగా రైతాంగం ఎదురుచూపు**

కథలాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల అనంతరం సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువల్లో భూములు కోల్పోతున్న రైతులకు శుభవార్త అందింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లింపు కోసం పబ్లిక్ నోటిఫికేషన్ విడుదలకు ఎట్టకేలకు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను సమన్వయం చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించడంతో రెండు రోజుల్లో ఆ ప్రక్రియకు మోక్షం లభించనుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాల రైతులకు కొద్ది రోజుల్లో పరిహారం అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

● **520 ఎకరాలకు రు. 70 కోట్ల పరిహారం**

కలికోట సూరమ్మ చెరువును రిజర్వాయర్‌గా మార్చుతున్న నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి స్టేజ్ 2 ఫేజ్ 1 లో భాగంగా మత్తడి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో అర టీఎంసీ నీరు ఈ రిజర్వాయర్‌లో నిల్వ ఉండడానికి అవకాశం ఏర్పడనుంది. సూరమ్మ నుంచి బీమారం, కథలాపూర్, మేడిపల్లి మండలాలకు చెందిన రైతులకు చెందిన సుమారు 50 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరందించాలని నిర్ణయించారు. దీనికిగాను రెవెన్యూ అధికారులు కుడి, ఎడమ కాలువలు తవ్వాలని సర్వేలు కూడా పూర్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వేలు చేసి హద్దులు నిర్ణయించారు. ఆరు సంవత్సరాల కిందట నష్టపరిహారం చెల్లింపు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించినప్పటికీ నిధులు కేటాయించలేదు. ఆ సమయంలో అప్పటి మార్కెట్ విలువ ప్రకారం రు. 40 కోట్ల నిధులు అవసరమని అధికారులు తేల్చారు. ప్రస్తుతం మార్కెట్ విలువ పెరిగిన నేపథ్యంలో రు. 70 కోట్ల మేర నిధులు అవసరమయ్యే పరిస్థితి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



సూరమ్మ చెరువు

ఎవరి భూములు ఎంతమేర కాలువల్లో కోల్పోతున్నారనే వివరాలతో నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ కాలువల నిర్మాణం కోసం అప్పటి సర్కారు 204 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిచింది. వెన్నా అనే కంపెనీ పనులు దక్కించుకుని ఇసుక తరలించి ఆరేళ్ల కిందటే క్యాంపు ఏర్పాటు చేసుకుంది. పరిహారం చెల్లింపు ప్రకియ పూర్తి కాగానే కాంట్రాక్టర్ పనులు ఆరంభించేదుకు సిద్ధమయ్యారు.

చికిత్స పొందుతూ జాలరి మృతి

గొల్లపల్లి, నంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందోళి గ్రామానికి చెందిన నారవేణి తిరుపతి (38) అనే చేపల జాలరి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి, మరి కొంత మంది యువకులతో కలిసి ఆక్టోబరు 30న ఊర చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో ఓ సొర చేప ఆకస్మాత్తుగా ఎగిరి ప్రమాదవశాత్తు తిరుపతి చాతిపై బలంగా తాకింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా కుటుంబ సభ్యులు జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. ఏడు రోజుల అనంతరం పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య నారవేణి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్పన్ కాలనీకి చెందిన తుమ్మ అక్షిత జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడిసిన్ సీటు సాధించగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మంగళవారం సన్మానించా రు.

- కోరుట్ల పట్టణానికి చెందిన పద్మశాలి సంఘ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ బీజేపీ నాయకులకు మంగళవారం కలిశారు. హైదరాబాదులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, నిజామాబాదు ఎంపీ అర్వింద్‌తో పాటు రాష్ట్ర నాయకులను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు రుద్ర శ్రీనివాస్ తెలిపారు.

మెట్‌పల్లి టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణానికి చెందిన రాజేష్ కుమార్‌కు మంజూరైన రెండు లక్షల విలువగల ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం అందజేశారు.

బీర్‌పూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్వాయి గ్రామంలో గల అక్షర ఉన్నత పాఠశాల విద్యార్థిని చెట్ల శ్రీజ వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన శ్రీజ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక కావడంతో పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి విద్యార్థినిని అభినం దించారు.

బీర్‌పూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్వాయిలో గౌడ సంఘం వారు ఏర్పాటు చేస్తున్న సర్దార్ పాపన్న విగ్రహ ఏర్పాటు నిలిపివేయాలని మంగళవారం గ్రామ పంచాయతీ అధికారులు నోటీసు అంటించారు.